

ముత్తారం శివారులో విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న సీజీఎం రాజూచౌహాన్

## నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఎన్పీడీసీఎల్ సీజీఎం రాజూచౌహాన్

శంకరపట్నం, మే 21: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఎన్పీడీసీఎల్ సీజీఎం, కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి రాజూచౌహాన్ ఆదేశించారు. మంగళవారం ముత్తారం, వంకాయ గూడెం గ్రామాల్లో 11కేవీ విద్యుత్ ఫీడర్లను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గొల్లపల్లి శివారులోని సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న వీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో తాడికల్, ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ సెక్షన్ల విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాలు పడేలోగా 33 కేవీ, 11కేవీ లైన్ల మరమ్మతులు పూర్తి చేయాలని, లైన్లను తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగించాలని సూచించారు. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. సమావేశంలో కరీంనగర్ ఎస్ఈ గంగాధర్, హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు రావుల సంపత్‌రెడ్డి, కుమారస్వామి, ఎన్పీడీసీఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- ప్రియుడి చేతిలో వివాహిత హతం
- మెట్‌పల్లిలో సంచలనం



సింగం మమత (ఫైల్)

మారుతీనగర్, మే 21: వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నది. ప్రియుడే గొంతు నులిమి, కడుపులో పొడిచి హత మార్చడం జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం గోధూరుకు చెందిన సింగం మమత(38)కు మెట్‌పల్లికి చెందిన సింగం గంగాధర్‌తో సుమారు పదిహేడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. గంగాధర్ బైక్ మెకానిక్‌గా పని చేసేవాడు. వీరు ఉండే ఏరియాలోనే అబ్దుల్ అప్సర్‌తో మమతకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత క్రమంగా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంలో గంగాధర్, మమత మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మమత.. గంగాధర్‌తో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నది. మెట్‌పల్లిలోని దవాఖాన వీధిలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నది. అప్సర్ తరచూ మమత వద్దకు వచ్చి వెళ్లేవాడు. సోమవారం అర్ధరాత్రి మమత, అబ్దుల్ అప్సర్ మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన అప్సర్ మమతను గొంతు నులిమి కడుపులో కత్తితో పొడిచి పారిపోయాడు. తీవ్రరక్తస్రావం కావడంతో మమత మరణించింది. కాగా, మమత కొడుకు గ్రహీత్ ఫిర్యాదు మేరకు పోలీసులు అప్సర్‌పై కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మెట్‌పల్లి దవాఖానకు తరలించారు.

# అంగన్‌వాడీలకు మొండి 'చెయ్యే'

### హామీలు ఘనం.. ఆచరణ శూన్యం

- నామ్‌కేవాస్తేగా విరమణ సాయం పెంపు
- చాకిరీ చేసినా దక్కిందేమీ లేదంటూ టీచర్ల పెదవి విరుపు
- రేవంత్ సర్కారు వైఖరిపై ఆగ్రహం





**'ఏరు దాటే దాకా ఓడమల్లన్న.. ఏరు దాటినంక బోడమల్లన్న' అన్నట్టున్నది కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన రేవంత్ సర్కారు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నది. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా విరమణ సాయం అందిస్తామని మ్యానిఫెస్టోలో చేర్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పద్ధతిలోనే టీచర్లకు ₹లక్ష, ఆయాలకు ₹50 వేలు అందిస్తామని మొండి 'చెయ్యి' చూపింది. కాగా, నామమాత్రపు సాయంపై అంగన్‌వాడీలోకం పెదవి విరుస్తున్నది. ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఆందోళనకు సిద్ధమవుతున్నది.**

కరీంనగర్ కలెక్టరేట్, మే 21: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడం. సర్కారు అమలు చేసే కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, చిన్నారులకు చదువుచెప్పడంతోపాటు వారి ఆలనాపాలన చూడడం, ఓటరు జాబితాల తయారీ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం ఇలా అంగన్‌వాడీ టీచర్లు పుట్టెడు కష్టం చేస్తున్నరు. వీరి సేవలను గుర్తించిన కేసీఆర్ సర్కారు వారు ఆశించినదానికంటే మించి గౌరవ వేతనం పెంచింది. అంగన్‌వాడీల టీచర్ల విజ్ఞప్తి మేరకు గతేడాది మేనెలలో టీచర్లకు ₹లక్ష, ఆయాకు ₹50వేలు, ఆసరా పింఛన్ మంజూరు, బీఎల్‌వో విధుల రద్దు, అంగన్‌వాడీ కేంద్రాల పనులు మినహా ఇతర ప్రభుత్వ విభాగాల పనులేవి అప్పగించబోమంటూ హామీ ఇచ్చింది. అలాగే, ప్రభుత్వ టీచర్ల మాదిరి వేసవి సెలవులు వర్తింపజేసేందుకు అంగీకరించి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆరు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ రాజకీయ క్రీడకు తెరలేపింది. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తామని, కనీస వేతన చట్టం అమలు చేస్తామని ప్రకటించి ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీలపై సానుభూతిని నటించింది. న్యాయం చేస్తామని నమ్మబలికింది. ఇక దశ మారినట్టేనని సంబుర పడుతున్న తరుణంలో ఆశలపై నీళ్లు చల్లింది. విరమణ తర్వాత టీచర్లకు ₹లక్ష, ఆయాలకు ₹50 వేలు అందిస్తామని ఏప్రిల్‌లో జీవో నం.10 జారీ చేసింది. కాగా, సర్కారు నిర్ణయంపై అంగన్‌వాడీ టీచర్లు భగ్గుమంటున్నారు. అప్పుడు కనీస వేతన చట్టం తేస్తామని చెప్పి, ఇప్పుడు నామమాత్రపు సాయంతో చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని మండిపడుతున్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

### ఇచ్చిన మాట నిలుపుకోవాలి

అంగన్‌వాడీలకు కనీస వేతన చట్టం అమలు చేస్తామని అసెంబ్లీలో మంత్రి సీతక్క ఇచ్చిన మాట నిలుపుకోవాలి. తక్షణమే జీవో నంబర్10 రద్దు చేయాలి. ఈ యేడాది ఏప్రిల్ 3న విడుదల చేసిన 1334 మెమోను కూడా ఉపసంహరించుకోవాలి. ఆసరా పెన్షన్ కాదు, పెన్షన్ గ్రాట్యుటీ ప్రకారం వచ్చే పింఛన్ అందించాలి.

**- టేకుమల్ల సమ్మయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

## కోడ్ ముగియగానే పీఆర్సీ ప్రకటించాలి

కలెక్టరేట్, మే 21: ఎన్నికల కోడ్ ముగియగానే రెండో పీఆర్సీ ప్రకటించాలని, 40శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వోద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ కన్వీనర్ ఎం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం రెండు డీఏలైనా విడుదల చేయాలని కోరారు. అన్ని విభాగాల ప్రభుత్వోద్యోగులకు ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.



వీసీని సత్కరిస్తున్న యూనివర్సిటీ అధికారులు

## ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్

వీసీ సంకశాల మల్లేశ్‌కు ఘనంగా వీడ్కోలు



సురేంద్ర మోహన్

కమాన్‌చౌరస్తా, మే 21: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ప్రభుత్వం ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను నియమించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల ఉద్యోగ కాలం నిన్నటితో ముగిసింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఉప కులపతులను నియమించింది. రాష్ట్రంలో పది యూనివర్సిటీలకు ఇన్‌చారజి వీసీలను నియమించగా, ప్రస్తుతం గవర్నర్ కార్యదర్శిగా కొనసాగుతున్న సురేంద్ర మోహన్‌ను ఎస్‌యూకు కేటాయించింది. 2008లో ఏర్పాటైన శాతవాహన యూనివర్సిటీకి ఇప్పటి వరకు ముగ్గురు వీసీలుగా పనిచేశారు. అందులో 2008లో ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో సంకశాల మల్లేశ్ ఉన్నారు. మూడేండ్ల నుంచి వీసీగా సేవలందించిన మల్లేశ్‌కు ఉద్యోగులు, అధ్యాపకులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు ఆయన సేవలను కొనియాడారు.

### మల్లేశ్ తనదైన ముద్ర

ఎస్‌యూ వీసీగా సంకశాల మల్లేశ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన పరిపాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. యూనివర్సిటీకి 12(బీ) సాధనలో కీలక భూమిక పోషించారు. అందుకోసం పలు విభాగాలకు నిపుణులకు కేటాయించారు. పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకువచ్చారు. ఆయన చేపట్టిన చర్యలతో యూనివర్సిటీ స్థాయిలోనే కాకుండా ఉన్నత విద్యామండలి నుంచి సైతం ప్రశంసలు అందుకున్నారు. యూజీసీ యూనివర్సిటీకి సుమారు ₹20 కోట్లు కేటాయించింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటూ, న్యాక్ గుర్తింపు కోసం ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించారు.

## అద్దెగది భవనం పైనుంచి పడి..

- బాలుడికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్‌కు తరలింపు



గాయపడిన అభిరామ్

వేములవాడ, మే 21: ఉమ్మడి వరంగల్ జిల్లా కు చెందిన ఓ కుటుంబ సభ్యులు సోమవారం రాజన్న దర్శనం కోసం వేములవాడకు వచ్చారు. విడిది చేసేందుకు పట్టణంలోని ప్రైవేట్ భవనంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఈ క్రమంలో అభిరామ్(5) అనే బాలుడు ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి మంగళవారం కింద పడిపోయాడు. బంధువులు హుటాహుటిన బాలుడిని వేములవాడలోనే ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో బాలుడికి ఎడమ కాలు, దవడ భాగంలో తీవ్ర గాయాలైనట్లు బంధువులు తెలిపారు. భవన నిర్మాణం పూర్తి కాకుండానే గదులను అద్దెకు ఇవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు.


